క్లుప్తంగా

పేదల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మేకల దాసు

లక్సెట్టిపేట: పేద ప్రజలు చాలా మంది ఇళ్ల స్థలాలు, సొంత ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని, వారిని ప్రభుత్వం పట్టించుకొని అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో మండల నాయకులు మేదరి దేవవరం, రమణారెడ్డి, దుర్గం దేవదాస్, రాజన్న, సత్తన్న, బానుచందర్ పాల్గొన్నారు.

బడిలో చేర్పించాలని ప్రచారం



సర్వాయిపేటలో ప్రచారం

కోటపల్లి: బడిబాటలో భాగంగా ఆదివారం సర్వాయిపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన అందుతుందని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, పర్వీనా, తిరుపతి, సాబీర్, కరీం పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

తాండూర్: ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవడం కంటే కేసులు నమోదైన ఇరువర్గాల వారు రాజీ చేసుకుంటే అందరికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాజీమార్గమే రాజమార్గమని ఎస్సై తెలిపారు. మరిన్ని వివరాల కోసం తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

భగవద్గీత ప్రచారం

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూర్ జ్ఞాన వేదిక లక్సెట్టిపేట, కొడిమ్యాల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. లక్సెట్టిపేట, కొడిమ్యాల కమిటీల అధ్యక్షులు రాజు, రాకేష్, సభ్యులు రాజు, నాగిరెడ్డి, ఆదిత్య, తనీషా, రాజశేఖర్, రవళీ, రశ్మిత, లత పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి

చెన్నూర్: ఈ నెల 18న భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 8వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు, మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, సుంకరి చందు, శంకర్, తిరుపతి, శంకర్, నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.


గంజాయి మొక్కలు స్వాధీనం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన కొట్రంగి విజయ్(పోచన్న) తన పెరట్లో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడని సమాచారంతో ఆదివారం తనిఖీ చేయగా 8 గంజాయి మొక్కలు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని విజయ్‌ను అరెస్ట్ చేసి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. గతంలో విజయ్..గంజాయి మొక్కలను సాగు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన ముత్యపు అభిలాష్ ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయం అయ్యింది. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు మండల ఆర్యవైశ్య సంఘం తరపున రూ.94,988వేలు, జగిత్యాల వాసవి సేవాదళ్ తరపున రూ.63వేలు సేకరించి మొత్తం రూ.1,57,988లను ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు.

పగిలిన భగీరథ పైపులైన్



వేమనపల్లి: మండల కేంద్రంలోని బొగుడగూడంలో భగీరథ వాటర్‌ట్యాంకు పైపులైన్ పగిలి నీళ్లు వథాగా పోతున్నాయి. రోడ్డు బురదగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో 1997నుంచి 2007 వరకు డిగ్రీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో మెగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తిరిగి విద్యార్థులుగా మారి, ఆత్మీయంగా కలిసి పరస్పరం పలకరించుకున్నారు. ఆరునెలల పాటు శ్రమించి నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు అందరి మనసులను కట్టిపడేశాయి. గురువులను సన్మానించుకున్నారు. కార్యక్రమంలో సీవీ రామన్ విద్యాసంస్థల ఫౌండర్ గురిజాల రవీందర్‌రావు, నల్ల నరేష్, కస్తూరి శ్రీధర్, బోయినపల్లి అనిల్, అనురాధ, గోగు ప్రకాశ్, శుభాష్‌రావు, కాగితపు శ్రీనివాస్ పాల్గొన్నారు. – మంచిర్యాలఅర్బన్



గురువును సన్మానిస్తున్న విద్యార్థులు



పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 29ఏళ్ల అనంతరం కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ పాఠశాల ఆవరణలో ఉత్సాహంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అప్పటి ఉపాధ్యాయులు యోగేశ్వర్ రావు, రాజు, రోజ్‌మేరి, చంద్రసుశీలతో పాటు పూర్వ విద్యార్థులు నాగులు, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – రామకృష్ణాపూర్

లైబ్రరీ.. పాఠకుల వర్రీ

- తెరుచుకోని గ్రంథాలయాలు
- పక్కా భవనాలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

దండేపల్లి: రెండేళ్లుగా ప్రజలకు గ్రంథాలయ సేవలు దూరమయ్యాయి. మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయానికి పక్కా భవనం లేకపోవడంతో సుమారు 30ఏళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో గ్రంథాలయాన్ని నిర్వహించేవారు. వందల సంఖ్యలో సభ్యులు ఉండగా, నిత్యం వందలోపు పాఠకులు వచ్చేది. అన్ని రకాల దినపత్రికలతో పాటు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్, కథల పుస్తకాలు అందుబాటులో ఉండేవి. జీపీ భవనం శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం కూల్చివేశారు. దీంతో గ్రంథాలయనికి భవనం లేకుండా అయ్యింది. బస్టాండ్ సమీపంలో ఓ చిన్నగదిని అద్దెకు తీసుకొని, గ్రంథాలయ సామగ్రి ఉంచారు. గ్రంథాలయాన్ని తెరవడం లేదు. దీంతో ఇక్కడ సేవలు గత రెండేళ్లుగా అంతంత మాత్రమే. గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించి గ్రంథాలయాన్ని పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

తాళ్లపేటలో ప్రారంభించారు.. మూసేశారు..

మండలంలోని తాళ్లపేటలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ భవనానికి అప్పటి అదనపు కలెక్టర్ రాహుల్ 2023లో రూ.3.50లక్షలు నిధులు మంజూరు చేసి మరమ్మతు చేయించారు. అందులో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి దానికి లైబ్రేరియన్‌ను నియమించడంలేదు. గ్రంథాలయం తెరవడం లేదు. ఎప్పుడు మూసే ఉంటుంది.



అద్దెగదిలో దండేపల్లి శాఖ గ్రంథాలయం

పక్కా భవనం నిర్మించాలి..



దండేపల్లి శాఖ గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించాలి. జీపీ భవనంలో సుమారు 30ఏళ్లు గ్రంథాలయాన్ని నిర్వహించారు. జీపీ భవనాన్ని కూల్చివేసిన తర్వాత గ్రంథాలయం కనుమరుగయ్యింది. నేను గ్రంథాలయంలో 20ఏళ్ల క్రితమే సభ్యత్వం తీసుకున్నాను. జీపీ భవనంలో కొనసాగినప్పుడు నిత్యం వచ్చి దినపత్రికలు, జీకే బుక్స్ చదివాను.

– బొమ్మెన మహేష్, పాఠకుడు, దండేపల్లి

గ్రంథాలయాన్ని తెరవాలి



మండలంలోని తాళ్లపేటలో రెండేళ్ల క్రితం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అప్పుడు చాలా సంతోషపడ్డాం. ప్రారంభించారు తప్పా.. ఒక్క రోజుకూడా తెరవడం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా వదిలేశారు. లైబ్రరీ తెరిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పఠనాసక్తి పెరుగుతుంది.

– హైదర్‌ఖాన్, ప్రైవేటు ఉద్యోగి, తాళ్లపేట

విశ్రాంతి భవనంలో గ్రంథాలయం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మండల కేంద్రంలోని గ్రంథాలయానికి భవనం లేకపోవడంతో స్థానిక విశ్రాంతి భవనంలో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. నిత్యం సుమారు యాభై మందికి పైగా పాఠకులు గ్రంథాలయానికి వస్తుండగా, పుస్తకాలు, తాగునీరు, చదువుకోవడానికి స్థలం, లైటింగ్ లాంటివి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ భవనంలో, మరికొద్ది రోజులు పాత ఆసుపత్రి భవనంలో, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన విశ్రాంతి భవనంలో గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. పక్కా భవనానికి కొద్దిరోజుల క్రితం నిధులు మంజూరైనప్పటికీ, స్థలం లేకపోవడంతో ఇప్పటికీ నిర్మాణం వైపు దృష్టి పెట్టడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకొని పక్కా భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.



విశ్రాంతి భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

బీజేపీ విధివిధానాలపై సమీక్ష

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంట గ్రామంలో బీజేపీ విధి విధానాలపై మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ హాజరై నాయకులకు రాబోయే ఎన్నికల సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేసే విధంగా నాయకులకు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, ఆ పార్టీ నాయకులు సంజీవ రావు, దీక్షితులు, వెంకటేశ్, మల్లేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

బెల్లంపల్లి పట్టణ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి: స్థానికంగా భారతీయ జనతా పార్టీ(బీజేపీ) సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులుగా సల్లం సుమలత, ఉప్పులేటి స్రవంతి, బాసబోయిన యుగేందర్, గాండ్ల మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కె.అరవింద్, కార్యదర్శులుగా గంధం అనిల్, ఉహ ప్రసన్న, రాజశేఖర్, కోశాధికారిగా సంతోష్ అగర్వాల్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు మరో 43మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా కార్యదర్శి కె.గోవర్ధన్, నాయకులు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి.రమేశ్, నాయకులు రజనీ, శ్రావణ్, శ్రీనివాస్, చంద్రమౌళి, రాములు, రాజయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట కార్యవర్గం

లక్సెట్టిపేట: మండల నూతన బీజేపీ కార్యవర్గాన్ని నియమించినట్లు మండలాధ్యక్షుడు నాగిరెడ్డి హేమంత్ రెడ్డి తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా తోట సతీష్ కుమార్, బిల్ల అనిల్‌కుమార్, సిరిమండ వెంకటేష్, గుర్రాల శ్రీపాల్, ప్రధాన కార్యదర్శులుగా బొక్కనపెల్లి సతీష్‌కుమార్, మంద రాజేందర్, కార్యదర్శులుగా మచ్చ మహేష్, తొగేటి పద్మ, అచ్చ రాజన్న, మండే శ్రీనివాస్, ట్రెజరర్ దొంతుల వినోద్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.



'బాహుబలి' కనువిందు

సఫారీకి అడ్డంగా రోడ్డుపై నిలిచిన బాహుబలి దున్న

జన్నారం: భారీ ఆకారం గల అడవిదున్నకు అటవీశాఖ అధికారులు బాహుబలి గేదెగా నామకరణం చేశారు. ఈ అడవి దున్న జన్నారం అటవీ రేంజ్ ప్రాంతంలో కనిపిస్తుంటుంది. అయితే ఆదివారం సఫారీ ప్రయాణం చేస్తున్న పర్యాటకులకు సఫారి ట్రాక్‌కు అడ్డుగా రోడ్డుపై నిల్చొని వర్షానికి రోడ్డుపై నిలిచిన నీటిని తాగుతూ కనిపించింది. అడవి దున్నను చూసి కాస్త దూరంలోనే వాహనాన్ని నిలిపివేశారు. జన్నారం రేంజ్‌లో అడవి దున్నల సంఖ్య పెరిగినట్లు అటవీ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేలా పోరాటం

మంచిర్యాలటౌన్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సమస్యలపై ప్రత్యక్ష పోరాటం చేస్తామని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా మహాసభల సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జనచైతన్య యాత్ర చేస్తామని తెలిపారు. అనంతరం యూనియన్ జిల్లా సన్నాహక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి కన్వీనర్‌గా మిట్టపల్లి మధు, కో కన్వీనర్లుగా సత్యగౌడ్, కె.వెంకటస్వామి, కె.రవి, సభ్యులుగా ఎం.భీమయ్య, సుమన్, ఎం.రాజు, కె.శ్రీనివాస్ ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు



చేపలు కొనుగోలు చేసేందుకు గుమిగూడిన జనం



గుడిపేట ప్రాజెక్ట్ వెళ్లే మూలమలుపు వద్ద...

మృగశిర సందడి

భీమారం/మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమిని/నెన్నెల/తాండూర్/బెల్లంపల్లి: మృగశిరకార్తె ప్రవేశించిన రోజు చేపలు తింటే శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయని, శరీరంలో వేడి తగ్గుతుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రజల విశ్వాసం. కార్తె ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేపల కోసం ఎగబడ్డారు. జిల్లా కేంద్రంతోపాటు భీమారం, బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, భీమిని, హాజీపూర్ మండలాల్లో చేపల మార్కెట్లు, చెరువుల వద్ద జనంతో సందడిగా మారాయి. సాధారణ రోజుల్లో కంటే వ్యాపారులు ఒక్కో చేప రకాన్ని బట్టి కిలో రూ.250 నుంచి రూ.800వరకు విక్రయించారు. నెన్నెల మండలం గొల్లపల్లి పెద్ద చెరువులో మైలారంకు చెందిన కంపెల పవన్‌కు 16కిలోల భారీ రౌ చేప లభ్యమైంది. ఆ చేపను విక్రయించగా రూ.3,200వచ్చినట్లు జాలరి చెప్పాడు. కాసిపేట మండలం ధర్మారావుపేటలో ఉన్న ఓ చెరువులో 15కిలోలకు పైగా బరువు ఉన్న చేప లభ్యమైంది.



పెద్ద చేపను చూపుతున్న జాలరి పవన్

ఘనంగా పోచమ్మ బోనాలు



రామకృష్ణాపూర్: బోనాలతో మహిళలు



చెన్నూర్: బోనాలతో భక్తులు

రామకృష్ణాపూర్/చెన్నూరు: చెన్నూర్ మండలంలోని సోమనపల్లిలో బొడ్రాయి పండుగ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. రెండు రోజుల పాటు వేదమంత్రోచ్చారణ మధ్య కార్యక్రమం కొనసాగింది. భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత బొడ్రాయి శిలావిగ్రహాలను గ్రామం నడిబొడ్డున ప్రతిష్ఠించారు. గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన మదనపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా జరిగింది. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడంతో ఉత్సవాలు ముగిసాయి. రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్‌కే1 సుభాష్‌నగర్‌లో గల పోచమ్మ ఆలయం వద్ద పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా భీరన్న కల్యాణం

వేమనపల్లి: కుర్మగూడం భీరన్న దేవుడి వారోత్సవాలతో సందడిగా మారింది. వారం రోజులుగా గొల్లకుర్మలు తమ ఇలవేల్పు అయిన భీరన్న(వీరభద్రుడు)కి మొక్కులు అర్పిస్తున్నారు. గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం బోనాలతో ఊరేగింపు నిర్వహించి, భీరన్న దేవుడి గుడి ముందు ప్రదక్షిణలు చేశారు. మధ్యాహ్నం భీరన్న దేవుడి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు భీరుమల్లు బృందం భీరన్న కథాగానం నిర్వహించారు. వారోత్సవాలు బుధవారం వరకు కొనసాగుతాయని కులపెద్దలు భీరయ్య, తిరుపతి తెలిపారు.

ఆధ్యాత్మికం

ప్రాణహితకు రేణుకా మాత



నది స్నానానికి గ్రామదేవతలతో వెళ్తున్న పూజారులు, ఒగ్గు కళాకారులు

వేమనపల్లి: రాజారాం దశవతార క్షేత్రం వద్ద రేణుక ఎల్లమ్మ జాతర ప్రారంభమైంది. గ్రామ దేవతలైన రేణుక ఎల్లమ్మ, లక్ష్మీదేవర, పోతరాజులతో ఆదివారం నదీ స్నానానికి బయలుదేరారు. పుణ్యస్నానం ఆచరించి శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల డమరుక నాథాల మధ్య గుడి వద్దకు తరలించారు.

పెద్దమ్మతల్లి బోనాలు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పూజలు నిర్వహించి బోనాలు చెల్లించుకున్నారు. సంఘ సభ్యులు మామిండ్ల సత్తయ్య, పలువురు భక్తులు పాల్గొన్నారు.

యువతే సింగరేణి భవిష్యత్తు

శ్రీరాంపూర్: యువతే సింగరేణి భవి ష్యత్తు అని ఐ ఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద ఆదివారం ఐఎన్టీయూసీ యువజన విభాగం సమావేశం నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ముల్లా రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్‌రావు మాట్లాడుతూ.. సింగరేణిలో యువ నాయకత్వం ఎంతో అవసరం ఉందన్నారు. కారుణ్య ఉద్యోగాల వల్ల యువ కార్మికులు చాలా మంది సింగరేణిలో చేరారన్నారు. యువ కార్మికులను నాయకత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి యూనియన్ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, నాయకులు జీవన్ జోయల్, బాపు, మనోజ్ పాల్గొన్నారు.